# పలివెల లింగా

## శతకము



తటవర్తి శ్రీకళ్యాణచక్రవర్తి

## 'పలివెల లింగా ' శతకము

## తటవర్తి శ్రీకళ్యాణచక్రవర్తి విరచితము

ప్రథమ ముద్రణ

ప్రజ-పద్యం సభలు , రాజమండ్రి 19 జనవరి 2020

సర్వస్వామ్యములు శతకకర్తవి.

ఇందులో ఏ భాగం గానీ పద్యం గానీ రచయిత అనుమతి లేకుండా వేరే ఎక్కడైనా ప్రచురించటంగానీ, వాడుకోవటం గానీ చట్టరీత్యా నేరం.

Copyright ©Tatavarthy Sri Kalyan Chakravarthy

No part of this book is allowed to be reproduced or reused in any form without prior permission from the author.

Author Contact : tskalyan.c@gmail.com

+61 488 210 113

**అంకితం:**

**పలివెల శ్రీ ఉమాకొప్పులింగేశ్వర స్వామికి---**

# కళ్యాణ్-మస్తు

మిత్రులు శ్రీ తటవర్తి కళ్యాణ చక్రవర్తి గారి "పలివెల లింగా"శతకమును ఆసాంతము చూసా.. ఇది 108 కంద పద్యాల్లో రాయబడ్డ శతకం.కవి గారు అమెరికాలో నివసిస్తున్నప్పటికీ మాతృ భాషాభిమానాన్ని రక్షించుకోవడమే కాకుండా ,సాహిత్య సృజన కూడా చేయడం నిజంగా గొప్ప విషయమే.వీరి శతకం  కొంత విస్తృతార్థంలో డయాస్పోరా సాహిత్యం కిందకు వస్తుందంటే సత్యదూరం కాదు.

భక్తి శతకం అంటే భగవంతుడితో భక్తుడు ఏ అనుసంధాన కర్తల అవసరమూ లేకుండా నేరుగా మాట్లాడే ఒక ప్రత్యక్ష మాధ్యమం.ఈ శతకంలో కళ్యాణ్ గారి అచంచల భక్తి భావన మనకు ప్రతి పద్యంలోనూ ప్రత్యక్షమౌతుంది.వీరు భవ పాపాలను రూపు మాపుకోవడానికీ,మోక్షాన్ని పొందానికి పరంపరాగత శతక కవుల్లాగానే భగవత్పాద పద్మాలను ఆశ్రయించారు.శతకంలో చాలా పద్యాలు స్తుతిప్రధానంగా  సాగిపోతాయి.వీరి పలివెల లింగేశ్వరుడు నిరాకార సాకారుడైన జ్ఞాన ప్రకాశ స్వరూపుడు.

కళ్యాణ్ గారు  చాలా సుకుమార హృదయులుగా ఈ శతకం ద్వార తెలుస్తున్నది.సాహిత్యం పేరు మీద జరుగుతున్న రాజకీయాలను నిరసిస్తారు. ఒక కవి మరొక సాటి కవి ప్రతిభను మెచ్చుకోలేని ఈర్ష్యాస్వభావాన్ని , నిరసిస్తారు.వీరి ఆవేదనాత్మక అధిక్షేపానికి

''ఇతరుల దాటుకు పరుగిడి-

సతతము స్వార్ధంబు దాల్చి సర్వుల నణచన్-

చితిలోఁగాలక మెఱసెడు-

పతకములేముండు మెడకు పలివెలలింగా'

అన్న పద్యం మంచి ఉదాహరణ.

వీరికి జన్మభూమిపైన,ప్రత్యేకించి పలివెల గ్రామంపైన విశేషమైన ప్రేమ. ఎక్కడో సుదూరంలో ఉన్నా పలివెల వీరి మనసులో పదిలంగానే ఉంది.అవకాశం దొరికినప్పుడు తమ గ్రామాన్ని అక్షరాల దర్పణంలో చూపించారు.

''వేదాధ్యాయుల వల్లెలు

గోదావరియలల దివ్యఘోషలు నుతులై

మాదెస నీ జపయోగ

స్వాదురవనిధానమమరెఁ పలివెలలింగా''_ _ _ అనీ,

‘‘తెరువరికొరకై యరుగులు

నురగల మజ్జిగయు నిలుపనోచిన వీడుల్

పురమున కొల్లలు "గోదా

వరి" తీరము నీకుఁ మాఱు పలివెలలింగా’..అనీ

సంక్షిప్తంగానే అయినా సచిత్రంగా వర్ణిస్తారు.పండిన పంటలు కూడా  పరమేశ్వరుడి కృపావిశేషాన్ని తెలుపుతూన్నాయని తమ క్రియాభక్తిని చాటుకుంటారు.

కవి గారు ప్రాచీన తెలుగుకావ్యాలను సంప్రదాయ సిద్ధంగా హృదయమగ్నంగా చదువుకున్న వారి లాగా కనిపిస్తారు..

ఈ శతకంలోని ,

‘‘శ్రీవైష్ణవసత్సంగా !--శ్రీవిద్యాభూషితాంగ ! రిపుహృద్భంగా  !

దేవా ! సద్భక్తవిమల-భావాబ్జమధురసభృంగ ! పలివెలలింగా !’....

‘‘అక్షయశుభప్రసాదా!--త్ర్యక్షా ! మునిసురగణరిపుదైత్యవిపక్షా

దక్షాధ్వరనాశక ! పా--పక్షయదీక్షాదయాక్ష పలివెలలింగా’’....

స్తుతచరణా! భవతరణా! —శృతి పథ సగుణ ప్రమాణ  సుగుణోద్దరణా!''

వంటి చక్కటి వృత్యనుప్రాసతో  కూడిన పద్యాలూ,

''జిహ్మేన్వీక్షధర పురా- జిహ్మాగమగు నీదు భక్తి సిద్ధించుటయే

బ్రహ్మాపదంపు తొలియడుగు -బ్రహ్మానందనిధి వీవు పలివెల లింగా ''

వంటి దుష్కర ప్రాసలతో కూడిన పద్యాలూ ,మనల్ని అబ్బురపరుస్తాయి.

పద సంపదతో పాటు మనోహర భావ సౌందర్యం కలిగి భవిషత్కాలంలో  ఒక ప్రౌఢకావ్యాన్ని వాగ్దానం చేస్తున్నాయి.

కళ్యాణ్ గారు తమ సమర్థతకు  మరింత వన్నె పెట్టుకుంటూ , సమాజోపయోగకరమైన కవిత్వాన్ని రచిస్తూ,తటవర్తి వంశానికే కాకుండా పద్యకవిత్వానికే దీప్తి తెచ్చి,తమకంటూ ఒక ముద్ర వేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

తేదీ: 22/12/2019




**ఎం.వి.పట్వర్ధన్**

ఎడ్మిన్,ప్రజ-పద్యం &  అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మంచిర్యాల ,

తెలంగాణ,ఇండియా.

చరవాణి;9393751540

సత్కవులను ప్రోత్సహిస్తూ , పద్యానికి పట్టం కడుతున్న ప్రజ-పద్యం ఫేస్బుక్ సంఘం వారికి ధన్యవాదాలు ….

చం:

**కవులను ప్రోత్సహించి ఘనకావ్యములన్ ప్రభవింపజేయుచున్**

**ప్రవిమల చిత్తులై తెలుగుభాషకు తోరపు సేవజేయుచున్**

**నవపథమున్ కవిత్వమును నల్గురు మెచ్చువిధంబునుంచు ప**

**ద్య విజయసారథుల్ గణనిధానమతుల్  ప్రజ-పద్య నాయకుల్ !**

# కవిపదం – శివపథం

శివుడంటే అవ్యక్తానందం. శివుడంటే రసప్రవాహం. శివుడంటే సత్యానుభవవిహారం.

శ్రీ పార్వతీపరమేశ్వరులకు నమస్కారములు.

పరమశివుని భక్తి నేర్పిన నా తల్లిదండ్రులకు నమస్కారాలు.

పరమేశ్వరుని చేరే విద్యలు బోధిస్తున్న గురువులకు నమస్కారాలు.

పరమశివుని స్తుతిస్తూ అనేకమంది కవులు అనేక పద్యాలు కల్పించి ఆనందించారు. శివసంబంధమైన ప్రతీ పద్యం పరమపథానికి సోపానమే. అలాంటి పూర్వకవులందరికీ నా నమస్కారాలు.

పలివెలలో కొలువై నా ఈ పద్యశతకాన్ని వ్రాయించుకున్న శ్రీ ఉమాకొప్పులింగేశ్వరస్వామికి  నా భక్తిపూర్వక నమస్కారాలు .

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం గ్రామానికి దగ్గరలో ఉన్న పలివెల గ్రామంలో కొలువైన శ్రీఉమా కొప్పులింగేశ్వర స్వామి మహామహిమాన్వితుడు . భక్తులకు కొంగు బంగారం.

స్థలపురాణం ప్రకారం కౌశికీ నది ఒడ్డున తపస్సు చేసుకుంటున్న అగస్త్యమహాముని పార్వతీపరమేశ్వరుల కళ్యాణం వీక్షించలేకపోయానని దివ్యదృష్టితో చూడగా నిజంగా పార్వతీపరమేశ్వరులు కళ్యాణాంబరములలో ప్రత్యక్షమవుతారు. వారిని అలాగే అక్కడ ఏకపీఠం పై కొలువవ్వమని ముని కోరగా వారు కరుణతో ఏకపీఠం పై అవతరించారు . ఇలా ఏకపీఠంపై పార్వతీ పరమేశ్వరులు ఉన్న క్షేత్రం ఇదే కావటం విశేషం.

ఈ స్వామి ముందుగా అగస్త్యలింగేశ్వరునిగా ప్రసిద్ధుడు. శ్రీనాథుడు వీరిపై శ్లోకం కూడా వ్రాసారని ప్రశస్తి. అక్కడ పూజారిని కాపాడటం కోసం , రాజు కోరగా , కొప్పుతో ( జటాజూటం ) ప్రత్యక్షమై కొప్పులింగేశ్వరునిగా ప్రసిద్ధి గాంచాడు.

నా తల్లిదండ్రులు ఈ క్షేత్రం గురించి ఎంతో భక్తితో చెప్పేవారు. మా స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా గోవూరు అయినను , ఉభయగోదావరి జిల్లాలలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలన్నీ తెలుసు.

అలాగే పలివెల కొప్పులింగ స్వామి గురించి అమెరికాలో పలివెల గ్రామస్థులైన శ్రీ యెఱ్ఱాప్రగడ శాయిప్రభాకర్ గారు ఎంతో భక్తితో చెప్పేవారు.

ఇలా అమెరికాలో ఉంటున్నా స్వామిపై భక్తి పుట్టి , ఒకానొక కారు ప్రయాణంలో శ్రీ యెఱ్ఱాప్రగడ శాయిప్రభాకర్ గారి ప్రేరణతో  స్వామిపై శతకం వ్రాద్దామని సంకల్పం కలిగింది. స్వామి దయతో అమెరికాలో ఉండగా శతకం పూర్తయింది.

తరువాత నివాసం ఆస్ట్రేలియాకు మారింది. ఇదిగో స్వామిదయ ఇప్పుడు కలిగి , ప్రజ-పద్యం శ్రీ పట్వర్ధన్ గారి అనుమతితో  , రాజమండ్రి లో జనవరి 19 , 2020 న ఆవిష్కరణ జరుపుకుంటోంది.

ఇలా మూడు ఖండాల సాక్షిగా , కర్మభూమి భరతఖండంపై ఆవిష్కరింపబడుతున్న ఒక ప్రవాస భక్తుని భక్తి శతకం ఈ పలివెల లింగా శతకం.

ఈ సందర్భంగా శ్రీ పట్వర్ధన్ గారికి అనేకానేక ధన్యవాదాలు. పద్యాలను పరిశీలించి , ముందుమాట వ్రాసి,  ముద్రణకు ప్రోత్సహించి నన్ను నడిపారు. వారి సామాజికసేవాభిలాషకు , వారి కార్యదీక్షకు తోడై , శ్రీపలివెల లింగేశ్వరుని అనుగ్రహం ఎల్లప్పుడూ వారి కుటుంబానికి ఉండాలి అని కోరుకుంటున్నాను.

అలాగే ముద్రణకు సహకరించిన ప్రజ-పద్యం అడ్మిన్ గార్లకు నా ధన్యవాదాలు.

అలాగే శివస్వరూపులై నా శతకాన్ని చదువబోతున్న మీ అందరికీ నా నమస్కారసహస్రములు.

తప్పులన్నీ నావి , దయ మా కృష్ణుడిది.

**తటవర్తి శ్రీకళ్యాణచక్రవర్తి**

మెల్బోర్న్ , ఆస్ట్రేలియా.

+61 488 210 113

తటవర్తి శ్రీవేంకటేశ్వరరావు, శ్రీవాణీవిజయలక్ష్మి దంపతులు ( కవి తల్లిదండ్రులు )



తటవర్తి జాహ్నవి (కవి భార్య), తటవర్తి కృష్ణసుహాస్ (కవి పుత్రుడు) మరియు

కవి: తటవర్తి కళ్యాణ్.



1.

శ్రీకారుణ్యనిధీ ! నిజ

సాకల్యానుగ్రహప్రసాదకచరణా !

లోకాఘవినాశకరా!

ప్రాకట వరదానచరిత పలివెలలింగా !

2.

శ్రీవర్ధక! ధీపోషక !

జీవోద్ధారక ! శ్రుతినుత ! సితనగవాసా

దేవా దాసహృదయ స

ద్భావప్రేరక ! శరణముపలివెలలింగా !

3.

ఏ పథముంబట్టినడువ౧

శ్రీపురముకు దారిచిక్కి క్షేమంబగున

న్నా పథగామిగ౧ జేయుమ

పాపంబుల నణచివేసి పలివెలలింగా

4.

భావనచే మోక్షపథము౧

దీవెనగన్మాకు నొసగు దివ్యత్వము నీ

సేవలకే గలదయ్యా

పావననామా ! దయ౧గనుపలివెలలింగా

5.

మునుపెన్ని జన్మలఁగొనితిఁ

నినుఁ దలుపక భోగరాశి నిక్కంబనుచున్

ననుఁగావు విభో ! సురలని

పనులని మరి జాగుఁ వీడి పలివెలలింగా

6.

విరివిగ పెరిగిన కర్మలు

మరిగింప నెడారిరీతి మలగు మనములోన్

స్థిరభక్తి మొలకలెత్తగ

వరముల వర్షంబు వీవు పలివెలలింగా

7.

హరియే నీయందు నిలిచి

నిరతము మము గాచునన్ననిజమునరయగన్

పరుగున నినుఁ జేరనురికె

బరువగు మా కంటిగంగ పలివెలలింగా

8.

విజయములందున నీవే

నిజమగు భాగ్యంబు నీవు నేస్తంబీవే

స్వజనుడిగ నడుపువాడవు

భజియింతున్మరుపులేక పలివెలలింగా

9.

ఏ దారిన్నడువ సురలు

వేదంబుల్గొల్చు నెలవువెరవుపడుఁ నిజా

త్మోదయమగు నా నీశుభ

పాదార్చన వరమునిడుము  పలివెలలింగా

10.

కోరగ జాలని కోరిక

లూరుచు వేవేల జన్మలుంటిమి ధరపై

మారి నిన్నుఁ గోరు తీరుగ

ప్రారబ్దహరా ! నడుపుము పలివెలలింగా

11.

ధరణీపతులమని తలచి

పరిపరిప్రకృతిని కలచెడివారలఁ భస్మా

సురసుతసంతతిఁమార్చుము

వరగర్వముఁ గాల్చివేసి పలివెలలింగా

12.

మేదిని సర్వముఁ బొందినఁ

లేదని యేడ్తురు జనులు కలిమహిమఁ ధనమున్

కాదందు రెవ్వరతిసం

పాదనయే పరముగాగ పలివెలలింగా

13.

భాషోద్ధారణ నెపమున

వేషంబులు వేయగలరు విత్తార్జనకై

భాషకు పలుకేయర్చన

భాషారూపుడవు నీవు పలివెలలింగా

14.

పొగడిన చిందించగలరు

సొగసగు తమ పండ్లవరుసఁ జూపుచు నగవుల్

తగుసాటిఁ వానిఁబొగడగ

వగతురు సన్మానరతులు పలివెలలింగా

15.

నాలో సాక్షిగ నుండుచు

నీ లీలలెప్పింపుజేయఁ నేర్పుగ మాయా

జాలంబులు కల్పింతువు

ఫాలాక్షా ! విశ్వనాధ ! పలివెలలింగా

16.

ఇతరులయందు గల సర

స్వతి గని ప్రోత్సాహ మిచ్చు సంస్కృతిగల పం

డిత పోషకయంశఁ నిలిచి

ప్రతిభన్రక్షింతు వీవు పలివెలలింగా

17.

కుల,వర్గ, వైర జాడ్యము

‘కలి’యని సరిపెట్ట ఘనమె కాలాత్మునకున్

ఖలమని సరిదిద్దతగును

బలవితరణులైన మీకు పలివెలలింగా

18.

భవచక్రాంతర గతులకు

తవచరణద్వయము రక్ష ! తరియింపగ హే

తువు నే పట్టినదదియే

వ్యవహారము చక్కబెట్టు పలివెలలింగా

19.

ఏ దిక్కు నిద్దరు గొడవ

తో దొరయుదురో యనుచు నె దురుచూచి మహా

వేదికలేర్పరచి జరుపు

వాదనలే నేటి జబ్బు పలివెలలింగా

20.

కుదురుగ నిగమాగమముల

చదువకయే తప్పులనుచు చాటింపులిడన్

పదపడి వేదిక లెక్కుచు

వదరుట పరిపాటి నేడు పలివెల లింగా

21.

ఆస్తికుడైనన్ , కొలువని

నాస్తికుడైనన్ , నడుమను నటుడైనను నీ

యస్తిత్వమడుగఁ మూగలు

వాస్తవ మనుభవవిహారి పలివెలలింగా

22.

మెండగు సన్మానోత్సవ

మండితుడై బుద్ధిఁవిడిచి మదమునుజూపన్

పండితుడైన నతనిదౌ

పాండిత్యము నేతిబీర పలివెలలింగా

23.

మించిన పాలను మొత్తము

మంచిగ నే పాత్రఁదాచఁ మరునాడు చెడున్

కొంచెముఁగలవారిఁ దలచి

పంచగఁ దీపొనునవియె పలివెలలింగా

24.

శ్రీసిద్ధేశా ! మునిసుర

దాసానందకరవేష ! ధర్మవికాసా !

భాసురసద్భావాచల

వాసా! నిజభక్తపోష ! పలివెలలింగా

25.

శక్తినీన్నియందునిలిపి

ముక్తిన్దయజూపు దివ్యమూర్తివి, కొప్పున్

వ్యక్తముజేయుట చోద్యమె

భక్తుని రక్షింప నెంచి పలివెలలింగా!

26.

సిరి నీ బంధువు,గౌరీ

వరుడవు నీ పలుకుఁ మెచ్చు వాగీశ్వరియే

గొరగవు యోగివి మౌనివి

పరిశీలనకు దొరుకవట పలివెలలింగా

27.

అదియిది యనుచున్ బరుగులు

పదికాలములుండునట్లు పథకరచనలున్

చెదరని మోహపు నిదురన్

పదిలముగన్ నిల్పు కలలు పలివెలలింగా !

28.

కాలము కలిగించు సిరులఁ

కాలంబేకరగజేయు కర్మఫలముతోన్

హేలగ నిడెదవు మాకిట

పాలైనన్నీరమైన పలివెలలింగా

29.

అహమే నిండి మదికి నీ

మహిమల్తెలియంగరావు మదవర్ధనమై

దహియింపుమ దాని దయా

ప్రహితంబౌ చూపు నిలిపి పలివెలలింగా

30.

మరిమరి వేడెద దేవా

కరుణను నా కర్మచయముఁ కాల్చుమ దానిన్

భరియింపగ నిన్ను విడిచి

పరిపరి నను పుట్టుమనక పలివెలలింగా

31.

హరితావరణము "గోదా

వరి" వాసుల మంచితనము వరిసిరులలరన్

సురపురసమమై గ్రామము

వరసుక్షేత్రంబుగయ్యె పలివెలలింగా

32.

క్షీరాబ్ధిమథనజనిత సు

ధారస లింగం బగస్త్యుదయఁ గొలువై నీ

కారుణ్యమొప్ప ధరపై

పారించెన్భక్తిసుధలు పలివెలలింగా

33.

గరళంబున్గళమందున

నిరతంబుంచగలవీవు నేఁజేసిన తుం

టరిపనులఁ గడుపునుంచుకు

బరువే ? నను రక్షసేయ పలివెలలింగా

34.

అండగయుండగ నీకృప

మెండగు శుభముల్కదియును మిత్రత్వముతోన్

గుండెలనిండగ నీవే

పండును భవమయ్యు మాది పలివెలలింగా

35.

జిహ్మేన్వీక్షధర పురా

జిహ్మగమగు నీదు భక్తి సిద్ధించుటయే

బ్రహ్మపదంపు తొలియడుగు

బ్రహ్మేనందనిధి వీవు పలివెలలింగా

36.

ముక్తిన్గోరని డెందము

రిక్తఫలాసక్తము షడరీనిలయంబై,

యుక్తిన్ దానిన్ నీదగు

భక్తిప్రజమున నిలుపుమ పలివెలలింగా

37.

నీపై శ్రద్ధయు నిలువగ

కాపాడుము మమ్ము సర్వకాలములందున్

లోపల నినుగనుటెపుడో

పైపై మాయల ధృతి చెడి పలివెలలింగా

38.

శరణంబగస్త్యలింగా!

వరపంచనదీస్థిరతటవర్తీ!భర్గా

కరుణన్గొప్పను దాల్చిన

పరమదయామూర్తివయ్య పలివెలలింగా !

39.

దేవర ! సన్నుతిఁ సేతును

గావర !నా తప్పులణచి కరుణించు హరా !

నీవైపు మనసు నిలుపగ

భావంబుల నడుపుమయ్య పలివెల లింగా

40.

తెరువరికొరకై యరుగులు

నురగల మజ్జిగయు నిలుపనోచిన వీడుల్

పురమున కొల్లలు "గోదా

వరి" తీరము నీకుఁ మాఱు పలివెలలింగా

41.

శుభదాయక ! భవతారక !

విభవద్దాక్షిణ్యరూప విజయవిలాసా

ఇభముఖ షణ్ముఖ కిరణ

ప్రభాకలిత మోక్షసూర్య ! పలివెలలింగా

42.

సద్యఃప్రసాదకుడ వీ

వాద్యంతములందు నిండి యలరువెలుగు , శ్రీ

విద్యాఫలదాయకుడవు

వైద్యుండవు భవరుజముకు పలివెలలింగా

43.

వేఁవిధముల సాగు మనము

దేవర మిము కోరి నిల్చు దినమే నిజమై

జీవుని భవంబు పండున్

భావము భాగ్యము తమ దయ పలివెలలింగా

44.

నీ దయ కోరినవారికి

లేదన కీవిత్తు వన్ని లీలాధారా

కాదనకు పరము మదిలో

పాదుకు నినుగొల్తు నేను పలివెలలింగా

45.

కలకాలము నీ పదములు

కొలిచెడి భాగ్యమ్ము నిమ్ము , కోరికలాశల్

కలవరములేల ? కర్మల

ఫలములు నీ లెక్కకెరుక పలివెలలింగా

46.

గురుతరసూక్తులు నిత్యము

చరవాణిన చూచినంత సత్యముతెలియన్

మరి యనుభవ వేద్యమ్మగు

పరతత్త్వము నీదుభిక్ష పలివెలలింగా !

47.

కాసులు కోరుట యలవడి

నీ సుపథమున్గోరువిధము నేర్వని  జనులన్

దాసులుగన్ జేఁగొని గత

వాసనలన్ దొలగజేయి  పలివెలలింగా

48.

ఆశలురాశులు వాటికి

నాశంబేలేదిదేమి నాటక మమరెన్

కాశీనాథా ! దయగొను

పాశము నీచేత గలదు పలివెలలింగా

49.

కాలము మారినదంత

ర్జాలంబే కొత్తవేల్పు జనులకు నిత్యా

భీలంబగు భవరోగము

ఫాలాక్షా మారలేదు పలివెలలింగా

50.

నీదని సర్వజగంబున్

వేదము పొగడగ తెలిసెను విశ్వాధారా

నాదను నా యహముకు నీ

పాదరజము భ్రమలఁగూల్చుఁ  పలివెల లింగా

51.

జ్ఞానధనులౌ మునిజనులు

ధ్యానములో నిన్నడుగగ ధర్మప్రశ్నల్

మౌనముతో నవితీర్చెడి

వైనము నీ బోధకెటుక పలివెలలింగా

52.

మారని జన్మలకర్మల

దారులనంతంబు జేయి ధర్మాధ్వర మా

నేరముల లెక్కలెంచకు

భారము నీదే మరువకు పలివెలలింగా

53.

ముక్తిపథముబట్టి నడుచు

శక్తిన్దయజూడు సర్వసాక్షీక ర్మా

సక్తతఁనీ ధ్యానమణచు,

భక్తిసుమాలంకృతపద పలివెలలింగా

54.

సాధనయను పుట్టచెడన్

క్రోధమనెడు విషధరంబు క్రుమ్మరుఁలోనన్

వేధవినుత! రిపుషట్క

వ్యాధికి నీ భక్తి మందు పలివెలలింగా

55.

వేదాధ్యాయుల వల్లెలు

గోదావరియలల దివ్యఘోషలు నుతులై

మాదెస నీ జపయోగ

స్వాదురవనిధాన మమరెఁ పలివెలలింగా

56.

సదయత మా భవరోగము

కుదరగజేయంగకున్నకోరికలెన్నో

మదిలోకుదురుకు వదలవు

పదివేలగు జన్మలైనఁ పలివెలలింగా

57.

పరిపొలముల మాగాణులు

మరిమరి మనసులను దోచు మర్యాదలతోఁ

సిరులొలుకునేల మాదై

పరిపరి నీ దయను జూపు పలివెలలింగా

58.

ఎకరము లెన్నియు కలిగినఁ

నికరముగన్ జివరి కింత నేలయెచాలున్

సకలము నీదే మోహ

ప్రకరంబున్ దలగనిమ్ము పలివెలలింగా

59.

ఎంతని తప్పుకు తిరిగిన

పంతము నెగ్గించుకొనును పంచత్వంబే

యింతటి దానికి గొప్పల్

భ్రాంతుల్మదిలో నిలుపకు పలివెలలింగా

60.

శ్రీవైష్ణవసత్సంగా !

శ్రీవిద్యాభూషితాంగ ! రిపుహృద్భంగా !

దేవా ! సద్భక్తవిమల

భావాబ్జమధురసభృంగ !పలివెలలింగా !

61.

పనికై పొగడ్తలన్నియు

పెనుగాలుల రీతి చెలగు,ప్రేమల్గురియున్ !

మునుపటి మాటలవెల్లువ

పని ముగియగనింకిపోవు! పలివెలలింగా!

62.

స్తుతచరణా ! భవతరణా !

శ్రుతిపథసగుణప్రమాణ ! సుమనోద్ధరణా !

స్థితిఁదలుపక రక్షనిడన్

ప్రతి నీకున్లేదు భర్గ ! పలివెలలింగా !

63.

ఇంతల నంతలనుచు శ్రీ

మంతుల పొగడి కడకునవమానము పడకన్

గొంతు నిను తెలుపఁ నడుపుము

భ్రాంతులణగు కథలు నీవి పలివెలలింగా

64.

వనమున దారిన్వెతుకుచు

కనులేలేనట్టివాని క్రమమునడుగ యా

తనయే మిగులు గురువు పా

వనుడవ్వక శిష్యుఁజెలుచు పలివెలలింగా

65.

నిరుపేదపూజఁ జేయగ

దొరికిన జలములను జల్లఁ దోరపువరముల్

సురగంగాధర ! కూర్చెదు

పరమానందంబు నీది పలివెలలింగా !

66.

ఇతరుల దాటుకు పరుగిడి

సతతము స్వార్ధంబు దాల్చి సర్వుల నణచన్

చితిలోఁగాలక మెఱసెడు

పతకములేముండు మెడకు పలివెలలింగా

67.

దర్పణమందున బింబపు

కూర్పుకు సరిపోలు మాయ కుదరగ,విశ్వం

బేర్పడె నీ యాట గెలువ

స్వర్పతికే వీలుగాదు పలివెలలింగా!

68.

మౌనము బోధగ మారును

ధ్యానము నిగమార్ధ సన్నిధానంబగుచున్

గ్లానిన్ మాపున్ , కదలని

వైనముతో లోఁన తిరుగు పలివెలలింగా

69.

బీజముఁ జనించు నంకుర

మై జగమిది నిర్వికల్పమయమౌ నాదిన్

నీ జాలపు చిత్రకళా

భ్రాజితమై భవమునందు పలివెలలింగా

70.

స్ఫురణన్సదాత్మకుడవై

విరచించితివింతమాయఁ వేడుకమీరన్

కరుణించి "తత్త్వమసి" యని

పరమున్బోధింతువయ్య పలివెలలింగా

71.

దేహముపై భ్రాంతి నిలిపి

సోహమ్మని బోధజేయ సొమ్ములు రాలన్

మోహోపహత మతులదౌ

వ్యాహారంబేపరంబు ? పలివెలలింగా!

72.

దినకరుఁరాహువు గలచు వి

ధి ననుదినము మాయకప్పి ధీద్యుతి నణచన్

ఘననిద్రాంతకమై శో

భనకరమౌ జాగృతి నిడు పలివెలలింగా !

73.

సర్వావస్థలఁ సాక్షిగ

పూర్వజ్ఞానంబు నిచ్చు ముద్రన్మోక్షా

ధర్వా! బోధింతువజా !

స్వర్వాసస్తుతశుభపద పలివెలలింగా!

74.

కనబడువిశ్వమునంతయు

గనుచున్తనకన్నవేరుకాదను తలపున్

మనసున నిలుపు గురువు పా

వనుడై నీ యంశనుండు పలివెలలింగా

75.

బ్రహ్మము సూర్యుడు చంద్రుడు

బ్రహ్మంబే పంచభూత భాసంబరయన్

బ్రహ్మము జీవునిచేతన

బ్రహ్మము మూర్త్యష్టకంబు పలివెలలింగా

76.

మనుజుల్ పైపై మెఋుగులు

ఘనమగు వస్త్రాదులెల్ల గరిమగనెంచన్,

మునివేషము తగునే త్రిభు

వనపోషక పదవిఁనీకు పలివెలలింగా

77.

స్వీయబలము లేకుండగ

మాయను నమ్మకు మృదువగు మాటలఁవిషమున్

దీయగ కలుపు దురాత్మ్మ ల

పాయము స్నేహాధ్వమందు పలివెలలింగా!

78.

ఒకటే గేహమునొప్పుచు

నొకటే పీఠంబుపైన నీశ్వరితోడన్

ప్రకటితమైతివి భక్త

ప్రకరముకున్మోక్షమివ్వ పలివెలలింగా

79.

రాజాజ్ఞ భీతిపెంచగ
పూజారి శరణుశరణని పూర్తిగ నమ్మన్
నీ జటఁ జూపితివి ప్రజకు
పైజన్మలు లేక జేయ పలివెలలింగా

80.

రాజమహేంద్రవర నృపుని
పూజల్గొని భక్తకల్పభూజంబుగ ధీ
తేజుల సుజనసురపరి
వ్రాజకుల నుతులుఁ గొనితివి పలివెలలింగా

81.

లోకక్షేమముకొఱకై

నీ కళ్యాణమున కగస్త్యుఁనిర్జరు లాపన్

సాకల్యముగ వధువుతో

ప్రాకటమైతివి ఋషిమతి పలివెలలింగా

82.

వరిమాగాణుల నాడుచు

తిరిగెడు తెమ్మెరలు తాకఁ తెలియపురమునన్

హరహరయనున్పలికి స

ర్వ రసాలదళము లదరుచు పలివెలలింగా

83.

పరనిందారతులై బ్రతు

కు రజోనిధులైన బుధులు కోరి వదరుచున్

బురదను ఫలరసమనువిధి

పరిపరిజుఱ్ఱంగ నెంత్రుపలివెలలింగా

84.

మరుఁనే గాల్చిన కన్నుకు

బరువే శుష్కతృణరాశి వంటి యఘచయం

బర నిమిషమ్మున నంతటి

పరికించి కలచి దహించ పలివెలలింగా

85.

కరతాళధ్వనులన్వినఁ

మరగిన కొందరు కవులకు మరియొక కవిలో

పెరుగు నలువరాణి చలువ

బరువై మాత్సర్యమడరు పలివెలలింగా

86.

పైపై ప్రేమలలోకముఁ

నీపై స్థిరభక్తి నెట్లు నిలుపుట యనగా

లోపల నీవేనని నీ

ప్రాపు నరయుటేను దారి పలివెలలింగా

87.

ఘనతంత వట్టివోవగ

కనబడిన కవితల నన్యకవిసత్కృతులన్

తన రచనల నకలులనుట

పనిలేని కపటుని సృజన పలివెలలింగా

88.

పొగడన్వ్యక్తులఁ జివరకు

నగుబాటౌను మెడఁశిలలు నగలై మిగులున్

తగురీతిన్నిన్ను గొలుతు

వగపుల్సెడి తోషమలరపలివెలలింగా

89.

ఇహపరసిద్ధపదా ! గురు

గుహబోధితసత్త్వ ! సర్వగుణచయనాథా !

మహదైశ్వర్యనిధీ! పా

పహరణకార్యానురక్త! పలివెలలింగా

90.

మృగధర ! శివావర ! చలదు

రగహార ! నిగమవిహార !  రమ్యేందు ధరా

సుగజాజినాంబర ధరా

భగవద్భక్తహృదయచర పలివెలలింగా

91.

శ్రీవిద్యోదయ భాసా!

భావోద్ధితకర్మపోష! భాగ్యవిశేషా !

కైవల్యపథవికాసా !

పావనహృన్నిత్యవాస పలివెలలింగా

92.

అజ్ఞానాంతకరూపా

యజ్ఞోత్సవతోష ధీవిహాయసపూషా

తజ్ఞా ! శివామనోజ్ఞా

ప్రాజ్ఞస్తుతిచయవిహార పలివెలలింగా

93.

అక్షయశుభప్రసాదా!

త్ర్యక్షా ! మునిసురగణరిపుదైత్యవిపక్షా

దక్షాధ్వరనాశక ! పా

పక్షయదీక్షాదయాక్ష పలివెలలింగా

94.

దేవాసద్భక్తచయ మ

నోవాసా నీ చరితముఁ నుడివెద నిరతం

బీవే ముక్తివిధాతవు

భావానందాబ్ధి సోమ పలివెలలింగా

95.

అంగజనాశా! దివ్యో

త్తుంగతరంగ యగు గంగ తొందరపడఁ ఖ

ట్వాంగా ! గర్వము నణచిన

భంగిన్ నా మనసుఁ గావు పలివెలలింగా

96.

సుమరసముం గ్రోలు మిళిం

దము బురదంగోరబోదు తగునని ప్రజకున్

స్వమతం బమృతసమంబౌ

భ్రమయే పరమతపువార్త పలివెలలింగా

97.

పరుల మతంబుల వేల్పుల

పరిపరి నిందించు వారి వాగ్ధోరణిపై

చురచురలాడెడు కంటిని

పరమేశా నిల్పు తెఱచి పలివెలలింగా

98.

తిట్టెద రార్షమతంబున్

కట్టుకథల్వ్యాప్తిజేయ కలిపురుషసుతుల్

నెట్టనవారిన్వదలక

పట్టి దహింపు మన్మథహర పలివెలలింగా

99.

ఎన్నివిధంబుల నీదినఁ

కన్నుల కగుపడగలేదు కైవల్యతటం

బెన్న భవాబ్ధినణచి వి

ద్వన్నుత దరిజేర్చు మమ్ము పలివెలలింగా

100.

చేసిన పుణ్యము పండగ

చూసిన నీ పూజలన్నిశుభములనిడగన్

వాసిగ పద్యశతంబున్

వ్రాసితి నీ కలము నొౌచు పలివెలలింగా !

101.

తటవర్తివంశదీప్తుల్

స్ఫుటముగ కలకాల మదరు శుభయోగంబున్

ఘటియింపజేయ నీ స్తవ

పటలమునందు నిలిచితివి పలివెలలింగా

102.

కల్యాణపద్యశతము న

తుల్యము జేయంగ కరుణతోనిందను సా

కల్యముగ నీ వరిగి కై

వల్యము చదువరికిడెదవు పలివెలలింగా

103.

దివిజకులచక్రవర్తీ!

కవిమానసచక్రవర్తిగన్ గాంతిల్లన్,

నవసరణి నీ శతకమున

భవమందితి వాత్మరూప పలివెలలింగా

104.

శరణము శ్రుతిభూషా నీ

చరణములన్నమ్మియుంటి సర్వేశా నీ

స్మరణము మనసుకుఁ దివ్యా

భరణము భక్తిప్రకాశ పలివెలలింగా

105.

వందనమాగమ వంద్యా

వందనమహిభూష యోగభాస్కరతేజా

వందనమాత్మవికాసా

వందన మానందరంగ పలివెలలింగా

106.

అరివర్గభంగ! దాసో

త్కరపాపాంబుదపతంగ! ధార్మికహృదయాం

తర సుఖచయ సత్సంగా!

వరకవితాపద్మభృంగ! పలివెలలింగా

107.

నీవే శబ్దము ఛందము

భావము నీనుండి విరియు పద్యసుమము లీ

సేవకు తరలి గుబులుకొనె

పావన నామా దయఁ గను పలివెలలింగా

108.

పూర్ణమున కెంతజేర్చిన

పూర్ణంబేయగు మది నిను పూజింపగ సం

పూర్ణంబయ్యెను శతకము

వర్ణన నా తపము గాఁగ పలివెలలింగా !!









స్వగ్రామం: గోవూరు(కొవ్వూరు)

పశ్చిమగోదావరి

నివాసం: మెల్బోర్న్ , ఆస్ట్రేలియా

వృత్తి: క్లౌడ్ కంప్యూటింగ్

## తటవర్తి శ్రీకళ్యాణ చక్రవర్తి

### శతకములు

| | |
|---|---|
| మాధవీయము | - ముద్రితము(Kinige.com) |
| సరదా శతకం | - ముద్రితము(amazon.com) |
| న్యూజిలాండు తెలుగు | - ముద్రితము (Kinige.com) |
| పలివెల లింగా | - ప్రస్తుత పుస్తకం |
| సోమేశ్వరా | - పూర్తి , అముద్రితము |
| శారదాంబికా | - పూర్తి , ముద్రణలో |
| వేంకట రామా | - పూర్తి , అముద్రితము |
| రామదండు | - పూర్తి, అముద్రితము |
| వర సప్తగిరీశ్వర | - పూర్తి, అముద్రితము |
| కృష్ణదివ్యనామము | - పూర్తి, అముద్రితము |

ఇతర పద్యరచనలు :::

భువనవిజయాలు :

1 ఒర్లాండో, ఫ్లోరిడా (30+ పద్యాలు , రచన)

2 నాట్స్ , చికాగో (20+ పద్యాలు, రచన) youtube

3 తలహాసీ, ఫ్లోరిడా (సహ-రచయిత)

4 ఆట్లాంటా , జార్జియా (ఆశువు - రామరాజభూషణుడిగా)

పద్యనాటకాలు :

1 మౌర్యచరితం. ( youtube)

2 మయసభ .

3 తెలుగు మరువకురా తెలుగోడా.